క్లుప్తంగా

నేడు పలు డివిజన్లలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'

మధురానగర్(విజయవాడసెంట్రల్): 'రీ కాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' గుర్తుకు తెస్తూ 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆదివారం 30, 61 డివిజన్లలో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు 30వ డివిజన్ దేవీనగర్ 8వ లైన్ ట్రెండ్‌సెట్ సమీపంలో, ఉదయం 11 గంటలకు 61వ డివిజన్ హెచ్ బ్లాక్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ మహిళల నిరసన

పాయకాపురం(విజయవాడరూరల్): స్మార్ట్ మీటర్లు మా ఇళ్లకు పెట్టొద్దంటూ రాజీవ్ నగర్‌లో మహిళలు సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నగర కమిటీ సభ్యులు జి.ఝాన్సీ మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉండగా లోకేష్ స్మార్ట్ మీటర్లు పెడితే పగులకొట్టమని పిలుపునిచ్చారని, నేడు టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నోరు మెదపకుండా ప్రజల విశ్వాసాన్ని పోగొట్టుకొంటున్నారన్నారు. పి.సాంబిరెడ్డి, అమ్ములు, నిర్మల, మల్లేశ్వరి, పార్వతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

15న అష్టలక్ష్మీ సహిత, శ్రీ మహాలక్ష్మి యాగం

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రావణ మాసం సందర్భంగా 15వ తేదీ శుక్రవారం ఉదయం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికపై హోమ, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్, ఉపాధ్యక్షుడు కేవీబీ రాజేష్ తెలిపారు. శ్రీ చక్రార్చన, ఖడ్గమాల, అష్టలక్ష్మీ పూజ సహిత శ్రీ మహాలక్ష్మి యాగం జరుగుతుందన్నారు. పేర్ల నమోదుకు 96181 93027, 92461 93903 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పిల్లల హక్కులను రక్షణ కమిటీ బాధ్యతగా తీసుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): పిల్లల హక్కులు, బాధ్యతలను చైల్డ్ వెల్ఫేర్, రక్షణ కమిటీ బాధ్యతగా తీసుకోవాలని కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ అన్నారు. కండ్రిక సుబ్బారెడ్డి హైస్కూల్‌లో వార్డు లెవెల్ చైల్డ్ వెల్ఫేర్, రక్షణ కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. కమిటీ చైర్‌పర్సన్‌గా కార్పొరేటర్ తిరుపతమ్మ, కమిటీ సభ్యులుగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు, టీచర్స్ సచివాలయం స్టాఫ్‌ను ఎన్నుకున్నారు. ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఎస్ఎన్ఎల్ కేంద్ర ప్రభుత్వ సహకారంతో దేశవ్యాప్తంగా 4జీ సేవలను ప్రారంభించటంతో పాటు ఆత్మనిర్భర భారత్ కార్యక్రమంలో భాగంగా బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్ ప్రారంభించినట్లు ఏపీ సర్కిల్ బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ బుంగా రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్‌లో కేవలం ఒక్క రూపాయికే సిమ్, 30 రోజుల ఫ్రీ కాల్స్, డైలీ 2 జీబీ డేటా అందిస్తామన్నారు. ఈ అవకాశం కొత్తగా సిమ్ తీసుకునే వారితో పాటు వేరే నెట్‌వర్క్ నుంచి బీఎస్ఎన్ఎల్‌కు పోర్టబిలిటీ ద్వారా వచ్చేవారికి వర్తిస్తుందని చెప్పారు. ఈ ఆఫర్ ఈ నెల 31వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్లాన్ కోసం బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ లేదా బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సెకండ్ స్కిన్ చీరల ప్రదర్శన, విక్రయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ బందరు రోడ్డులోని లెమన్ ట్రీ హోటల్‌లో హైదరాబాద్ నుంచి వచ్చిన సెకండ్ స్కిన్ ప్రత్యేక చీరల ప్రదర్శన, విక్రయాలు శనివారం ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి సేకరించిన అద్భుతమైన చేతిపని నేసిన చీరల సేకరణను చూడొచ్చన్నారు. పటాన్ పట్టోలా, బెనారస్, కటాన్ సిల్క్, టుస్సార్ జార్జెట్, కాటన్ జంఘాని, మష్రూ సిల్క్, అర్గంజా, గద్వాల్, కంచీవరం, రాజ్‌కోట్ పట్టోలా, చందేరి, క్రేప్ ఇతర ఫ్యాన్సీ చీరలు ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆదివారం కూడా ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు అన్నదాత సుఖీభవ అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద విలేజి కండ్రికకు చెందిన 56 మంది రైతులకు ఖరీఫ్ సీజన్ పెట్టుబడి సాయం విడుదలైనట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. 64వ డివిజన్ విలేజి కుందావారి కండ్రికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో ఈ ఏడాది ఒక్కో రైతుకు 20 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. అందులో మొదటి విడతగా రూ.7 వేలు జమ చేశామని చెప్పారు.

స్నేహమేరా జీవితం

- అభాగ్యులకు అండగా పలు సేవా కార్యక్రమాల్లో స్నేహితులు
- నేడు స్నేహితుల దినోత్సవం


అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వారంతా బాల్య స్నేహితులు. అతి సాధారణ కుటుంబానికి చెందినవారు. ముత్యాలంపాడు జెండా చెట్టు వీధి సమీపంలో కలిసి చదువుకున్నారు. కలిసిమెలిసి తిరిగారు.. ఆడి పాడి సందడి చేశారు. పెద్దయ్యాక సమాజంలో ఉన్న సమస్యలు, అనాథలు, హెచ్ఐవీ బాధిత చిన్నారులు, వృద్ధులను చూసి ఏదైనా సమాజానికి అవసరమైన సేవ చేయాలని స్నేహితుల్లో ఒకరైన కోరంగి నాగమల్లీశ్వరి, తోటి స్నేహితుడు షఫీతో చెప్పారు. దీంతో వారిద్దరు కలిసి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి తోటి స్నేహి తులు తాము కూడా సేవల్లో పాల్గొంటామంటూ తలో చెయ్యి వేశారు. అనాథలకు అన్నదానం, నిరుపేదలు, హెచ్ఐవీ, టీబీ బాధిత చిన్నారులకు నిత్యావసర సరుకుల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారి సంపాదనలో కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు.

ఇద్దరితో ప్రారంభమై..

15 ఏళ్ల క్రితం ఇద్దరు స్నేహితులతో ప్రారంభమైన వీరి పయనం ప్రస్తుతం 32 మందితో కొనసాగుతోంది. 2021లో హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసి సేవలను విస్తృతం చేశారు. వీరి సేవా కార్యక్రమాలను చూసి తోటి స్నేహితులు, సేవాతత్పరులు కూడా ట్రస్టుకు సేవలు అందిస్తున్నారు. రాబోయే రోజుల్లో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి అనాథలు, వృద్ధులను ఆదరిస్తామని వీరు చెబుతున్నారు.


బెస్ట్ సొసైటీ పురస్కారం అందజేస్తున్న ఏపీశాక్స్ అధికారులు(ఫైల్)

వరించిన పురస్కారాలు

ట్రస్ట్ పేరిట చేస్తున్న సేవాకార్యక్రమాలకు గానూ ఏపీస్టేట్‌ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ బెస్ట్ సొసైటీగా పురస్కారం అందజేశారు. అలాగే 48 సార్లు రక్తదానం చేసిన షఫీకి సర్టిఫికెట్ పురస్కారం అందజేశారు. సేవల్లో కీలకపాత్ర పోషిస్తున్న కోరంగి నాగమల్లీశ్వరికి హోప్‌దియోలాజికల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది.

సాయం చేయడమే నిజమైన స్నేహం..



పేదరికంలో ఉన్న వృద్ధులను చూసి మనసు చలించిపోయింది. దీంతో మా స్నేహితుల సహకారంతో వారికి అవసరమైన సేవలు అందించడం ఆనందంగా ఉంది. ఎవరికి వారు తాము సంపాదించిన మొత్తంలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు అందిస్తున్నారు. వారు సంపాదించే దానిలో కొంతభాగం సేవా కార్యక్రమాలకు కేటాయించటం అభినందనీయం.

– కోరంగి నాగమల్లీశ్వరి, ట్రస్ట్ ఫౌండర్

ఫ్రెండ్స్ అందరం కలిసి మెలిసి పనిచేస్తాం



మొదటి నుంచి మా ఫ్రెండ్స్ అందరం కూడా ఎవరికి సమస్య వచ్చినా స్పందించే వాళ్లం. అవసరంలో ఉన్న వారికి సాయం చేయడంతో పాటు ఇప్పటికే నేను 48 సార్లు రక్తదానం చేశాను. మేం ఏ పని తలపెట్టినా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి పనిచేస్తాం. ఎవరికైనా రక్తం అవసరమైతే మా ఫ్రెండ్స్‌లో ఎవరో ఒకరు ఇవ్వటానికి ప్రయత్నిస్తున్నాం.

– ఎస్‌కే షఫీవుల్లా, ట్రస్ట్ ఫౌండర్

అన్నింటి కన్నా స్నేహమే మిన్న



జీవితంలో ఎంత సంపాదించినా కలగని ఆనందం మా స్నేహితులతో కలిసి నేను చేస్తున్న సేవా కార్యక్రమాలతో కలుగుతుంది. నా బాల్య స్నేహితులతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉంది. ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయటానికి ప్రయత్నిస్తున్నాం.

– ఎస్‌కే రహీమా, ట్రస్ట్ మెంబర్

పింగళి వెంకయ్య సేవలు చిరస్మరణీయం


పింగళి వెంకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ జెండా రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బందరు రోడ్డులోని బాపు మ్యూజియంనందు శనివారం పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకొని పింగళి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విష్ణు మాట్లాడుతూ.. పింగళి 19 ఏళ్ల వయసులోనే బ్రిటీష్ ఆర్మీలో చేరి ఆంగ్లో – బోయర్ యుద్ధంలో పాల్గొన్నారన్నారు. ఆయన స్నేహితులు పింగళిని పలు రకాల పేర్లతో పిలుచేవారన్నారు. పింగళి వెంకయ్య జాతీయోద్యమ సమయంలో మహాత్మా గాంధీ, నెహ్రూ విజయవాడకు వచ్చిన సందర్భంగా జాతీయ జెండాను రూపొందించి ప్రదర్శించారన్నారు. ఈ విషయంలో 'యంగ్ ఇండియా' పత్రికలో పింగళి వెంకయ్య గొప్పతనాన్ని గాంధీ ప్రత్యేకంగా ప్రశంసించిందన్నారు. నేషనల్ ఫ్లాగ్స్ ఆఫ్ డిఫరెంట్ నేషన్స్ అనే పుస్తకాన్ని పింగళి వెంకయ్య రచించారని చెప్పారు. రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యదర్శి కొమ్ము చంటిబాబు, జిల్లా సెక్రటరీ వెంకట్రామిరెడ్డి, క్లస్టర్ వన్ ప్రెసిడెంట్ పిల్లుట్ల వంశీ, ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా సుధాకర్, కల్చరల్ విభాగం అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, క్లస్టర్ వన్ ఉపాధ్యక్షుడు మనోహర్, రాఘవ, కోలాంటి రవి, విక్కీ, వడ్డీ వాసు, బంకా బాబి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బెరంపార్క్‌లో నృత్య పోటీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ ఆదేశాల మేరకు భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుంచి నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లాసికల్, జనరల్, సోలో, గ్రూప్ డాన్స్ పోటీలు ఉంటాయన్నారు. ఆరేళ్లలోపు, ఏడు నుంచి పదేళ్లలోపు, 11నుంచి 15ఏళ్లలోపు, 16ఏళ్ల ఆపైబడిన వారు ఓ కేటగిరీ చొప్పున మొత్తం నాలుగు కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈనెల మూడోతేదీ మొదటి కేటగిరీ పోటీలు ప్రారంభమవుతాయని, ప్రతి ఆదివారం ఒక్కో కేటగిరీ చొప్పున పోటీలు ఉంటాయన్నారు. ముగింపు కార్యక్రమాన్ని ఐదో ఆదివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ వివరించారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రస్తుత సమాజంలో కల్తీ ఆహార పదార్థాల వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని.. ప్రధానంగా చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జి.మాధవి అన్నారు. సింగ్‌నగర్ ఇందిరానాయక్‌నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీఓలకు 'ప్రారంభ బాల్య దశ అభివృద్ధి' అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు, వారి సంరక్షుల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ప్రధానంగా పిల్లలకు ఇచ్చే ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారి ఆరోగ్యం, ఎదుగుదలపై ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీఓలు, ఏఎన్ఎంలు పిల్లల తల్లిదండ్రులకు ఈ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల మనస్తత్వ నిపుణులు టి.దుర్గాప్రసాద్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ కీర్తి, డీఈఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాగిన 'మట్టిమనిషి'


మట్టిమనిషి నాటకంలోని ఓ సన్నివేశం

విజయవాడకల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి, జాషువా కళావేదికల ఆధ్వర్యంలో బందరురోడ్డులోని మాకినేని బసవపున్నయ్య సాంస్కృతిక వేదికపై శనివారం ప్రదర్శించిన మట్టిమనిషి సాంఘిక నాటకం వాస్తవ సంఘటనలకు అద్దంపట్టింది. మూలకథ వాసిరెడ్డిసీతాదేవి నవల మట్టి మనిషి నాటకీరణ వల్లూరి శివప్రసాద్, దర్శకత్వం ఎస్ఎం బాషా వహించారు. వెంకయ్య మట్టిని నమ్ముకున్న వ్యక్తి బతుకు తెరువు వెతుక్కుంటూ పల్లెకు వస్తాడు. పొలం కౌలుకు తీసుకోని స్వయం కృషితో ఐదు ఎకరాల పొలం పండించుకుంటాడు. అతని కొడుకు సాంబయ్య కూడా 80 ఎకరాల పొలం కొంటాడు, తండ్రి ఎవరివద్దనైతే జీతగానిగా పని చేస్తాడో ఆమె కుమార్తెను వివాహం చేసుకుంటాడు. ఆమె పట్టణం మీద వ్యామోహంతో ఊరుదాటుతుంది. దీంతో సాంబయ్య జీవితం అస్తవ్యస్తమవుతుంది. సాంబయ్య భార్య వరూధిని పరవ్యామోహంలో పడుతుంది. సాంబయ్య జీవితం సర్వనాశమైపోతుంది. మట్టికి మనిషికి సామాజికంగా ఉండే సంబంధాలు, వాటి మంచి చెడ్డలు ఈ మార్పుల్లోని సంబంధాలకు దృశ్యీకరణ మట్టిమనిషి నాటకం. సాంబయ్యగా రాజర్షి, యలమందగా ఎస్ నారాయణ, కనకయ్యగా సురభి రాఘవ, వరూధినిగా గుడివాడ లహరి నటించారు.

చెట్ల తీగలు తొలగించారు..

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాక్షి కథనానికి విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. 28వ డివిజన్ రాజేశ్వరి వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ మీదకు పాకిన చెట్ల తీగలను శనివారం విద్యుత్ సిబ్బంది తొలగించారు. నిత్యం రద్దీగా ఉండే రాజేశ్వరి వీధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మీదకు చెట్ల తీగలు వ్యాపించాయి. దీంతో ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గురించి వివరిస్తూ 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి దినపత్రికలో శనివారం కథనం ప్రచురించితమైంది. దీనిపై స్పందించిన ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ బీవెంకటస్వామి ట్రాన్స్‌ఫార్మర్ మీదకు వ్యాపించిన చెట్ల తీగలు తొలగించటంతో పాటు పరిసరాలు శుభ్రం చేయించారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నాటక రంగ పురోగతికి బళ్లారి రాఘవ ఎనలేని సేవలు


బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నాటక రంగ పురోగతికి ఎనలేని సేవలు అందించిన వ్యక్తి బళ్లారి రాఘవ అని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. నాటకాలపై ప్రత్యేకాభిమానం, ప్రతిభతో తన సమయాన్ని, సంపదను ఆ రంగ అభివృద్ధికి కేటాయించారని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో తెలుగు నాటకరంగ ప్రముఖుడు, న్యాయవాది బళ్లారి రాఘవ 145వ జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి రాఘవకు నాటక రంగంపై ఆసక్తి ఉండేదని, ఆయన ఆసక్తిని గుర్తించిన ఆంధ్ర నాటక పితామహునిగా పేరొందిన ఆయన మేనమామ ధర్మవరం రామకృష్ణమాచార్యులు ప్రోత్సహించారన్నారు. 12వ ఏటా మొదటిసారి రంగస్థలంపై నటించి, నాటక రంగంలో సంచలనాలను సృష్టించి సినిమా రంగం వైపు వెళ్లిన గొప్పనటులు రాఘవ అని అన్నారు. విశాలమైన ఆలోచనలతో జాతి ప్రగతికి, మూఢాచారాల నిర్మూలనకు నాటకరంగం ప్రధాన సాధనమని భావించి నాటకరంగం అభివృద్ధికి విశేష కృషి చేశారని కలెక్టర్ కొనియాడారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

పటమట(విజయవాడతూర్పు): బళ్లారి రాఘవ నాటకరంగానికి కొత్త ఊపిరిని పోసిన మహానుభావులని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. బళ్లారి రాఘవ జయంతిని పురస్కరించుకుని వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో రాఘవ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ.. బళ్లారి రాఘవ రచనలు, నటన, సామాజిక విలువలతో కూడినవని కొనియాడారు. నాటకాలను వినోదంగా మార్చడమే కాకుండా, ప్రజలలో చైతన్యం నింపడమే ధ్యేయంగా ఆయన పనిచేశారన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథరెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, మేనేజర్ ప్రభావతి పాల్గొన్నారు.

కాటన్ సీడ్ ఆయిల్ అండ్ మీల్ కాంక్లేవ్ ప్రారంభం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ఓ హోటల్‌లో ఆరో కాటన్ సీడ్ ఆయిల్ అండ్ మీల్ కాంక్లేవ్–2025 శనివారం ప్రారంభమైంది. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఇఏ), ఆల్ ఇండియా కాటన్ సీడ్ క్రషర్స్ అసోసియేషన్(ఏఐసీఓఎస్‌సీఏ)ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కాంక్లేవ్‌ను ముఖ్య అతిథి, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఖాదీ అండ్ గ్రామీణ పరిశ్రమ కమిషన్ సీఈఓ రూప్‌రాశి లాంఛనంగా ప్రారంభించారు. సదస్సులో కాటన్ సాగు, పంట సాగు అనంతర నిర్వహణ, ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్‌లో నూతన సాంకేతికత, పశువుల ఆహార ఫార్ములేషన్లు, స్మార్ట్ ప్యాకేజింగ్, బ్రాండింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్, మార్కెట్, ఫోర్కాస్టింగ్ తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. కాటన్ సీడ్ ఆయిల్ రుచిలోనూ, వాసనలోను ప్రామాణికంగా ఉంటుందన్నారు. ఆసియా వంటకాలలో ప్రధాన పదార్థంగా ఉందన్నారు. కాటన్ సీడ్ మీల్ కూడా పశువులకు అద్భుతమైన ఆహారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో త్రీ ఎఫ్ సంస్థ(తాడేపల్లిగూడెం) డైరెక్టర్ ఓపి గోయెంకా, ఏపీ చాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ఎస్ఈఏ ఉపాధ్యక్షుడు అంగ్షు మల్లిక్, సందీప్ బజోరియా పాల్గొన్నారు.

ఇది మోసకారి ప్రభుత్వం

- పథకాల్లో కోత విధించి ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు


క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలా మోసం, దగా, వంచనకు గురి చేసిందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, గ్యాస్ సిలిండర్లు ఇలా ప్రతి పథకంలోనూ కోత విధించి బాబు పాలనలో మోసం గ్యారెంటీ అని నిరూపించుకున్నారన్నారు. 25వ డివిజన్‌లో రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో.. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం శనివారం జరిగింది. వైఎస్ జగన్ ప్రెస్‌మీట్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు పేదలందరికీ నవరత్న పథకాలు అమలు చేశామన్నారు. ఏయే పథకాలు అమలు చేశామో ఆ వివరాలు సచివాలయాల్లో ఉంచామని చెప్పారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్, సూపర్ 7 హామీలు ఇచ్చిందన్నారు. వైఎస్ జగన్ కన్నా మెరుగైన సంక్షేమం ఇస్తామని చంద్రబాబు ప్రజలను నమ్మించారన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం శ్రీలంక అవుతుందని చంద్రబాబు తప్పుడు ప్రచారం చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే రూ. లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. ఈ ప్రభుత్వంలో రాష్ట్రం ఏమవుతుందో చెప్పాలని చంద్రబాబును డిమాండ్ చేశారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు రైతు భరోసా కింద ఏటా రూ.13 వేల చొప్పున ఇచ్చారని విష్ణు చెప్పారు. సీఎం చంద్రబాబు రూ.20 వేలు అన్నదాత సుఖీభవ కింద ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏడాది తర్వాత అన్నదాత సుఖీభవ పథకంలో కోత విధించి రైతుల ఖాతాల్లో వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం 53.58 లక్షల మందికి ఐదేళ్లలో రూ.34 వేల కోట్లు పై చిలుకు రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని చెప్పి... తొలి విడత రూ. 5వేలు మాత్రమే ఇస్తోందన్నారు. పైగా 7 లక్షల మంది రైతులకు కోత విధించిందని చెప్పారు. సిలిండర్‌లు కోత, తల్లికి వందనం కోత విధించిందన్నారు మాట తప్పి సుపరిపాలన పేరుతో ఇంటింటికి ఎలా వెళతారని నిలదీశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 25 డివిజన్‌లో రూ. 25 కోట్లు వివిధ సంక్షేమ పథకాలకు కేటాయించామన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అని ఈ ప్రభుత్వం నిరూపించిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి తేడాను ప్రజలు గమనించాలని సూచించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పింది, చెప్పనిది కూడా చేసిందన్నారు. కూటమి అన్ని విధాలా మోసం చేసిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. రాబోయే రోజుల్లో చార్జీలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రభుత్వం మోసకారి ప్రభుత్వమని, ఈ ప్రభుత్వ నైజాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువచ్చి వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అంతా కలిసికట్టుగా ప్రతి రోజు ఒక గంట ప్రజలతో మమేకం కావాలన్నారు. అపుడే ప్రభుత్వంపై ప్రజల్లో ఏ రకమైన భావన ఉందో అర్థమవుతుందన్నారు. ఇప్పటికే కొన్ని కమిటీలు వేశామని, నియోజకవర్గంలో పూర్తిస్థాయి కమిటీలు వేస్తామన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు పిల్లట్ల వంశీ, రఫీ, కోలంటి రవి, మానం వెంగయ్య, గంగాధర్, బంకా బాబీ, విజయలక్ష్మి, చిన్నబాబు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

వాణిశ్రీ నటన భావి నటీమణులకు ఆదర్శం


వాణిశ్రీ జన్మదిన వేడుకల్లో విజయలక్ష్మి, ప్రసూనా రామన్, దేవిడ్‌రాజు తదితరులు

విజయవాడ కల్చరల్: సినీ నటి వాణిశ్రీ నటన భావి నటీమణులకు ఆదర్శమని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో వాణిశ్రీ జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటి వాణిశ్రీ అన్నారు. సావిత్రి కళాపీఠం నిర్వహించిన అనేక కార్యక్రమాలలో అమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారన్నారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ మాట్లాడుతూ.. సావిత్రి నట వారసత్వాన్ని అందుకున్న నటి వాణిశ్రీ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, ప్రభల శ్రీనివాస్, కొప్పరపు బలరామకృష్ణ మూర్తి, చావా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. వాణిశ్రీ నటించిన చిత్రాల్లోని పాటలను గాయనీ గాయకులు ఆలపించారు.

నేడు మల్లాది శత జయంతి సభ

విజయవాడకల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఆశీస్సులతో ఆదివారం సాయంత్రం శివరామకృష్ణ క్షేత్రంలో ఆధ్యాత్మికవేత్త, శృంగేరీపీఠం, తిరుమల తిరుపతి ఆస్థాన విద్వాంసులు మల్లాది చంద్రశేఖర శాస్త్రి శత జయంతి సభను నిర్వహిస్తున్నట్లు ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య శలాక రఘునాథ శర్మ, విశ్వనాథగోపాల శర్మ, చింతలపల్లి ఆంజనేయ ఘనాపాటి, తంగిరాల రాజేంద్రప్రసాద్ పాల్గొంటారన్నారు. మల్లాది అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శాంతి భద్రతల పెంపునకు ప్రత్యేక చర్యలు


మాట్లాడుతున్న పోలీసు అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల శాంతి భద్రతలను కాపాడేందుకు మరింత పటిష్ట చర్యలు చేపట్టామని ఏడీసీపీ జి.రామకృష్ణ అన్నారు. 'సురక్ష కమిటీ' నార్త్ డివిజన్ సమావేశం సింగ్‌నగర్ షాదీఖానాలో శనివారం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నగరంలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించామని.. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునాతన టెక్నాలజీలను ఉపయోగించి ఎక్కడికక్కడ నేరాలను అరికట్టడమే కాకుండా పాఠశాలలు, కళాశాలల వద్ద రక్షణ చర్యలతో పాటు నగరంలో ట్రాఫిక్ సమస్య ఎక్కడ తలెత్తుతుందోనని డ్రోన్ల సాయంతో తెలుసుకొని వెంటనే వాటిని కూడా పరిష్కరించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం సురక్ష కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. నార్త్‌జోన్ ఏసీపీ స్రవంతి రాయ్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న రూరల్ పోలీస్‌స్టేషన్‌ల సీఐలు ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.